ప్రజాశక్తి
మంగళవారం 8 ఏప్రిల్, 2025
5
శ్రీకాకుళం

10న పాతపట్నంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల పదో తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డి ఫార్మసీ, బి ఫార్మసీ, డిప్లమో పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. 15 కంపెనీల ప్రతినిధులు హాజరై 400 పోస్టుల్లో నియామకాలు చేపట్టడానికి ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు.

అభ్యర్థులు ముందుగా తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జిరాక్సు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 6301045132, 9704960160, 8317652552 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'బండ'తో బాదుడు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అదును చూసి దెబ్బ కొట్టింది. వంట గ్యాస్ ధరను పెంచి ప్రజలకు షాక్ ఇచ్చింది. గతేడాది సార్వత్రిక ఎన్నికలు, ఆ తర్వాత మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఎన్నికలు ఇలా వరుసగా ఎన్నికలు రావడంతో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని గ్యాస్ ధర పెంచకుండా వేచి చూసింది. దేశంలో ఇప్పుడు ఎక్కడా ఎన్నికలు లేకపోవడంతో బాదుడు మొదలు పెట్టింది. వంటగ్యాస్ సిలిండర్‌పై సోమవారం రూ.50 పెంచడంతో ఇప్పటివరకు ఉన్న రీఫిల్ ధర రూ.830 నుంచి రూ.880కు చేరింది. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలతో జిల్లాపై ఏడాదికి సుమారు రూ.25.79 కోట్ల భారం పడనుంది.

- **అదును చూసి ధర పెంచిన మోడీ ప్రభుత్వం**
- **ఎన్నికల సీజన్ ముగియడంతో వాత మొదలు**
- **వంట గ్యాస్‌పై రూ.50 పెంపు**
- **జిల్లా ప్రజలపై రూ.25.79 కోట్ల భారం**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాలో మొత్తం 36 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ పరిధిలో 19, టెక్కలిలో ఎనిమిది ఉండగా, పలాసలో తొమ్మిది ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,73,071 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సింగిల్ సిలిండర్ ఉన్న సాధారణ గ్యాస్ కనెక్షన్లు 1,81,305, డబుల్ సిలిండర్ ఉన్న కుటుంబాలు 1,20,678 ఉన్నాయి. దీపం కనెక్షన్లలో సింగిల్ సిలిండర్ ఉన్న కుటుంబాలు 1,86,737 ఉండగా డబుల్ సిలిండర్ ఉన్న కుటుంబాలు 17,176 ఉన్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఇచ్చిన కనెక్షన్లు 14,929 ఉన్నాయి. వీటితో పాటు ఉజ్వల పథకం కింద 56,754 కనెక్షన్లు ఉన్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 21వ తేదీ వరకు వంట గ్యాస్ ధరల జోలికి పోలేదు. ఎన్నికలు ముగిసిపోవడంతో మార్చి 22న సిలిండర్‌పై రూ.50 పెంచింది. ఇక అక్కడ్నుంచి ఆ ఏడాది సెప్టెంబరు వరకు ధరలను పెంచుతూనే ఉంది.

జిల్లాపై రూ.25.79 కోట్ల భారం

జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు సగటున 40 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్‌ను బుకింగ్ చేస్తారు. ఏడాదికి సరాసరిన తొమ్మిది సిలిండర్లను వినియోగిస్తారు. గ్యాస్ ధర రూ.50 పెంచడంతో ఒక్కో వినియోగదారునిపై రూ.450 భారం పడింది. ఈ లెక్కన జిల్లాలో ఉన్న 5,73,071 మంది వంట గ్యాస్ వినియోగదారులపై ఏడాదికి రూ.25.79 కోట్ల భారం పడనుంది.

వంట గ్యాస్ సబ్సిడీ ఎత్తివేత

వంట గ్యాస్‌పై కాస్తాకూస్తో అందిస్తున్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందటే ఎత్తేసింది. ప్రస్తుతం ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.520కు సిలిండర్ అందిస్తుండగా, అది రూ.570కు పెరిగింది. ఉజ్వల పథకం వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.310 వారి ఖాతాల్లో జమ చేస్తోంది. అదేవిధంగా సాధారణ వినియోగదారులకు సిలిండర్‌పై రూ.300 వరకు సబ్సిడీని అందించిన కేంద్ర ప్రభుత్వం క్రమేణా కుదిస్తూ ప్రస్తుతం వినియోగదారుల ఖాతాలో రూ.10.67 మాత్రమే జమ చేస్తోంది.

పెరిగిన ధరలతో పేదలు ఉక్కిరిబిక్కిరి

ఇప్పటికే అన్నిరకాల నిత్యవసరాల ధరల పెరిగి ఏమీ కొనలేని పరిస్థితుల్లో ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలపై వంట గ్యాస్ ధర పెంపు మూలుగుతున్న నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. ఇప్పటికే పలురకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. అదీగాక రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలను పెంచింది. కాస్తా కూస్తో వచ్చిన ఆదాయంతో నెట్టుకొస్తున్న సామాన్య జనంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఛార్జీలు, పన్నులు పెంచుతుండడం వారి ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారేలా చేస్తున్నాయి.

గిరిజన సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- **జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి**
- **ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి**
- **ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్**
- **తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన**

కొత్తూరు : ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

గిరిజనుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని తదితర డిమాండ్లతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, మందస, బూర్జ మండల కేంద్రాల్లో గిరిజనులు తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నాలు చేపట్టారు. అనంతరం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత ఐటిడిఎ లేని శ్రీకాకుళంలో దాన్ని ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజనులు చాలా ఏళ్లుగా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, దీంతో గిరిజనుల భూములకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో గిరిజనుల శ్మశానవాటిక భూములనూ ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. జిసిసి ద్వారా చింతపండు, చీపుర్లను కొనుగోలు చేయకపోవడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో చాలా గిరిజన గ్రామాలు ఇప్పటికీ తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీడిపంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మెళియాపుట్టి : తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద గిరిజనులు ధర్నాలు చేశారు. ధర్నా అనంతరం తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండాకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కన్వీనర్ సవర శ్రీను, రాజు, కౌలురైతు సంఘం నాయకులు పోలాకి ప్రసాదరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సుబ్బారావు, ఆదిలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మందస : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సవర గురునాథ్, సవర ఫల్గుణరావు, సవర లఖ్య, పున్నలమ్మ, దశమి, రూపావతి పాల్గొన్నారు.

కొత్తూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం తహశీల్దార్ రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు. సిర్ల ప్రసాదరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర ధర్మారావు, శివ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర గోపి, కె.రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు గిరిజనులు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. తహశీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర కృష్ణ, సింహాచలం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలంలోని ముఖలింగాపురం పంచాయతీలో ముఖలింగాపురం, బెండకాయలుపేట గ్రామాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం, గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యాన బెండకాయలుపేటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, నంబూరు షణ్ముఖరావు, గిరిజన సంఘం నాయకులు కె.అప్పారావు, డి.నీలవేణి, ముత్యాలమ్మ, సుహాసిని పాల్గొన్నారు.

సోంపేటలో రీ సర్వే చేయాలి

వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

- **తంపర కార్యదర్శిపై ఫిర్యాదు**
- **ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలకు వినతి**
- **190 వినతులు స్వీకరించిన కలెక్టర్, జెసి**

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని సోంపేట మండల కేంద్రం అతి పురాతనమైన పట్టణమని, అందులో వేలాది కుటుంబాలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని కొన్నేళ్లుగా ఉంటున్న ఇళ్లపై యజమానులకు ఎటువంటి హక్కులేదంటూ రెవెన్యూ రికార్డుల్లో రీ సర్వే సమయంలో చేర్చారని పలువురు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) జాయింట్ కలెక్టర్ ఫర్మాన అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 190 వినతులు వచ్చాయి. వాటిలో సోంపేట పట్టణానికి చెందిన సుమారు 40 మంది వారివారి కుటుంబ సభ్యులతో పాటు తరలివచ్చారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే సమయంలో కొన్ని వీధులను గ్రామ కంఠంగా రెవెన్యూ రికార్డుల్లో చేర్చారని వివరించారు. ప్రస్తుతం ఆ స్థలాలపైన నిర్మించుకున్న ఇళ్లపైన ఎటువంటి బ్యాంకు రుణం పొందకుండా చేశారన్నారు. గడచిన దశాబ్దాలుగా ఇంటి పన్ను చెల్లిస్తున్నా భవనాలకు సైతం గ్రామ కంఠమని అప్పటి సర్వేయర్లు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. తక్షణమే రీ సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే పాతశ్రీకాకుళం పొన్నాడ బ్రిడ్జికి వెళ్లే దారిలో 10 సెంట్లు విస్తీర్ణంలో గతంలో ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్వహించేదని, వాటిని 2005లో మున్సిపల్ అధికారులు తొలగించారని దాసరి తిరుమలరావు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం ఆ స్థలం ఖరీదు కావడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగి, అతని కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని అక్కడ భవనాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

తక్షణమే ఈ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. అలాగే ఆమదాలవలసకు చెందిన వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ ఆధ్వర్యాన పలు ఫిర్యాదులు అందజేశారు. పొందూరు మండలం తానేంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రూ.28 లక్షల వ్యయంతో సిమెంట రోడ్డు నిర్మించారని అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని మరో ఫిర్యాదు అందజేశారు. సరుబుజ్జిలి మండలం గోనెపాడు పంచాయతీలోని రైతుల రెవెన్యూ రికార్డులు సరిచేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే పాతపట్నం మండలం తంపరలో కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ గ్రామస్తులు ఫిర్యాదుల అందజేశారు. ధ్రువీకరణ పత్రాలకు ధరలు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. వీటితో పాటు వ్యక్తిగత సమస్యలు, సామాజిక అవసరాలకు సంబంధించిన వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు అప్పారావు, పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

సంతకాలను సేకరిస్తున్న ప్రజారోగ్య వేదిక, పలు సంఘాల నాయకులు

ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయాలి

ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని ప్రజారోగ్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు, జి.సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సంయుక్తంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్యకర ప్రారంభం - ఆశాజనక భవిష్యత్ అన్న నినాదాన్ని ప్రకటించిందన్నారు. ప్రభుత్వాస్పత్రుల సేవలను ప్రైవేటీకరణ చేపట్టకుండా ప్రభుత్వమే బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు ఇచ్చి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏటా గర్భిణులు శిశువుకు జన్మనిచ్చే లోపు అనారోగ్యం పాలై సుమారు మూడు లక్షల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వ్యవధిలో 20 లక్షల మంది శిశువులు మృతి చెందుతున్నారన్నారు. మహిళలకు మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యం అనేది ముఖ్యమని, దేశంలో మహిళల్లో పౌష్టికాహార లోపం రక్తహీనత ఎక్కువగా ఉందన్నారు. దేశ రక్షణ కోసం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, ప్రజల ఆరోగ్య రక్షణపై నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో ఆరోగ్యానికి పెద్దపీట వేయాల్సిన ప్రభుత్వాలు అరకొర నిధులు ఇస్తున్నాయని విమర్శించారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ వైద్యం అందిస్తున్న రిమ్స్ సర్వజనాస్పత్రితో పాటు సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేసి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన మందుల్లేక రోగులు అవస్థలు పడాల్సి వస్తోందని, అందువల్ల సేవలను మెరుగుపరచడానికి ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ కన్వీనర్ టి.రాము, ఎపి మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ కార్యదర్శి డి.వాసుదేవరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఉపాధ్యక్షులు సుధాకర్, పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఆదినారాయణ, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎం.గోవర్ధనరావు, ఐఎంఎ అధ్యక్షులు సనపల నరసింహమూర్తి, కార్యదర్శి కె.వినోద్‌కుమార్, ప్రజారోగ్య వేదిక సభ్యులు రాజారావు, కళ్యాణ్ రాజు, శ్రీకాంత్, సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి చంద్ర గ్రహణం

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

ప్రజారోగ్యానికి చంద్ర గ్రహణం పట్టిందని, ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చీమ కుట్టినట్లు కూడా లేదని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు విమర్శించారు. స్థానిక ప్రగతి భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వ చిత్తశుద్ధి తేటతెల్లమైందన్నారు. ఆరోగ్యశ్రీని వారి అనుయాయులైన బడా బాబులకు కట్టబెట్టి ప్రైవేటుపరం చేయనున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందా?, ప్రైవేటు వ్యక్తుల కోసం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో చంద్రబాబు సిఎంగా ఉంటే రాష్ట్రం సర్వనాశనమైపోయేదన్నారు. అమరావతిలో మెగా మెడిసిటీ కట్టిస్తే రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరుతుందా, ఎంతమంది రోగులు అక్కడకు వెళ్లగలరని ప్రశ్నించారు. వృద్ధి రేటు పెరిగిందని చెప్తున్నారని, ఆదాయం సమకూరితే ఎందుకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అప్పు అప్పు అంటూ తిరుగుతున్నారని, ఒక్క ఏడాదిలో అత్యధిక అప్పులు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని, ప్రైవేటీకరణ చేస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పోలాకి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా టిడిపి కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని డోల పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ నిధులు రూ.ఆరు కోట్ల అంచనా వ్యయంతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- **ఏళ్ల తరబడి పెండింగ్‌లో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు**
- **ఆధునీకరణకు నోచుకోని వంశధార ఎడమ కాలువ**
- **గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు**
- **నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం**

జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించనున్నారు. జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా వంశధార షట్టర సమస్య పరిష్కారం కావడం లేదు. సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. వంశధార కాలువల ద్వారా ఏటా శివారు భూములకు సాగునీరందని పరిస్థితి ఎదురవుతోంది. వేసవి నేపథ్యంలో ముందుగానే పనులు చేపడితే కొంతమేర సాగునీటి వెతలు తీరనున్నాయి. జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందిస్తామని చెప్తున్నా, పనులు మాత్రం చాలా ఆలస్యంగా సాగుతున్నాయి. వీటిలో ఎన్ని అంశాలు చర్చిస్తారు, వేటికి పరిష్కారం చూపుతారన్నది చూడాల్సి ఉంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువల ఆధునీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1600 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆధునీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్‌ఎస్‌ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టాబ్యారేజీ కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి. వంశధార కాలువలపై ఏర్పాటు చేసిన సాగునీటి కాలువలు ఎక్కడిక్కడ శిథిలమయ్యాయి. షట్టర్లపై అవినీతి కేసు 15 ఏళ్ల గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గోడౌన్లలో సుమారు రూ.ఐదు కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోలు చేయాల్సి ఉంది.

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు

జిల్లాలో మొత్తం 3,127 గ్రామాలు ఉండగా, కేవలం 1518 గ్రామాలకే తాగునీరందుతోంది. 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీటి సరఫరా సాగుతోంది. జిల్లాలో 38 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాలు ఉండగా ఏ ఒక్క పథకమూ సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లాలో ఉన్న 918 రక్షిత మంచి నీటి పథకాల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో 15,848 చేతిపంపులు ఉన్నా, ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి.

తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రతి ఏడాది ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేవారు. జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి కనెక్షన్లు ఇస్తున్నామనే పేరుతో ప్రభుత్వం మూడేళ్లుగా సరఫరా నిలిపేసింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో బావులు ఇంకిపోయాయి. చేతి పంపులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

ఉన్నపళంగా ఆగిన కరకట్టల పనులు

కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో గత వైసిపి ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. గత జెడ్‌పి సాధారణ సమావేశాల్లోనూ ఎమ్మెల్యేలు గొండు శంకర్, నిమ్మక జయకృష్ణ దీనిపై లేవనెత్తారు. ఈ సమావేశంలో దానిపై ఏం చర్చిస్తారో చూడాల్సి ఉంది.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM. O.S.No 42/2024.

Between:
1. Sri Chandra Prakash Jain,
2. Smt Punam Joshi,
3. Sri Gunda China Veerabhadra Rao,
4. Sri Gunda Veerabhadrayya. ....Plaintiffs.

And:
1. M/s Jai Mohini Associates, Represented by its Managing Partner, Smt Kadiyala Naga Mohini,
2. M/s Kala Vaibhav, C/o M/s Jai Mohini Associates, Represented by its Managing Partner, Smt Kadiyala Naga Mohini,
3. Smt Kadiyala Naga Mohini,
4. Sri Thiruveedhula Dharmendra....Defendants.

To
THE DEFENDANTS No 3 AND 4
Defendant No 3: Smt Kadiyala Naga Mohini W/o Thiruveedhula, Dharmendra, Business, R/o 501, Kattera Street,Ajantha Enclave, Srikakulam Town, Srikakulam District.
Defendant No 4: Sri Thiruveedhula Dharmendra S/o Sivajeevanarao, Business, Hindu, aged about 50 Years, R/o 501, Kattera Street, Ajantha Enclave, Srikakulam Town, Srikakulam District.

Please take notice that the above named Plaintiffs instituted the above matter against you. The said suit stands posted to **17th day of April 2025 at 10.30 A.M.** for your in person or through an advocate before the appearance. On that date you to appear Isaid Honourable Court at **10.30 A.M.,** failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా ప్రజలందరికీ ఆధార్ సేవలు సులభంగా అందించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 732 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 146 ఆధార్ కిట్లు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఇంకా 37 కేంద్రాలు ఈ నెలాఖరుకు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఆధార్‌కు సంబంధించిన కొత్త కార్డు నమోదు, డాక్యుమెంట్ అప్‌డేట్, ఐదు నుంచి ఏడేళ్లు, 15 నుంచి 17 ఏళ్ల వయసు గల వారి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు ఈ ఆధార్ కేంద్రాల్లో లభ్యమవుతున్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి నెలలో ఎనిమిది రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో క్యాంప్ మోడ్‌లో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమున్న ప్రాంతాలను గుర్తించి సంబంధిత సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రజలు తమ పరిధిలో క్యాంపు ఎప్పుడు జరుగుతుందో సచివాలయాలను సంప్రదించి, ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆరేళ్ల లోపు పిల్లలు తమ జనన తేదీ వివరాలతో సమీప ఆధార్ కేంద్రాన్ని సంప్రదించి ఆధార్ నమోదు చేయించుకోవాలని కోరారు.

వినతులను స్వీకరిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టెక్కలి : ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయే శాఖల పరిధిలో ఉన్న అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా 19 అర్జీలను స్వీకరించారు. వీటిలో అధికంగా రెవెన్యూ శాఖకు 13 రాగా, విద్యాశాఖ సంబంధించి 2, పంచాయతీరాజ్ శాఖకు 2, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రెండేసి చొప్పున అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న త్రినాథరావు

విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో అర్హులైన విఆర్‌ఎలకు ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, విఆర్‌ఒ వంటి పోస్టుల్లో ప్రమోషన్లు కల్పించాలని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాథరావు డిమాండ్ చేశారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ వెంకటేష్ రామానుజులుకు వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణా రాష్ట్రంలో అమలవుతున్న విధంగా పేస్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న విఆర్‌ఎలను విఆర్‌ఎలుగా గుర్తించాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో విఆర్‌ఎల కుటుంబాలు సతమతమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల విఆర్‌ఎలు పాల్గొన్నారు.

టెక్సాస్ యుఎన్‌టిను సందర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అమెరికా విద్యావ్యవస్థలో టెక్నాలజీ, తయారీ రంగంలో ఉన్న టెక్నాలజీలను ఎన్‌ఆర్‌ఐలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. యుఎస్‌ఎ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే రవికుమార్ టెక్సాస్‌లో యుఎన్‌టి యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా (సిఎఎఎం) సెంటర్ ఫర్ ఎగ్లే అండ్ అడాప్టివ్ యాడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు వివిధ విభాగాల్లో జరుగుతున్న రీచార్జ్, ఇన్నోవేషన్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలతో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ఇటువంటి అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థను రాష్ట్రంలో నెలకొల్పి విద్యావ్యవస్థలో వినూత్న మార్పులతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి సహక రించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు అధిక ప్రాధా న్యత ఇస్తూ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను సరి చేస్తున్నారని వివరించారు.

శిలాఫలకాలు తోసేసి... స్థల ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి- ఆమదాలవలస

శిలాఫలకాలు తొలగించి నిర్మిస్తున్న షాపులు

మండలంలోని కొత్తవలస జంక్షన్ వద్ద ఉన్న శిలాఫలకాలను కొంతమంది వ్యక్తులు తోసివేసి స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం రోడ్డు మార్జిన్‌లో గతంలో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం శిలాఫలకాన్ని వేశారు. కొత్తవలస జంక్షన్ నుంచి కొల్లివలస జంక్షన్ వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టేందుకు శిలాఫలకం వేశారు. ఇటీవల కాలంలో రోడ్డు పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ బూర్జ మండలం కొల్లివలస వద్ద రోడ్డు పనుల కోసం శిలాఫలకం వేశారు. కొత్తవలస జంక్షన్‌లో రోడ్డు శిలాఫలకాన్ని తోసేసి పోరంబోకు స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. ఈ జంక్షన్‌లో సెంటు భూమి విలువ ఐదు లక్షలపైనే ధర పలుకుతుండడంతో వాణిజ్యానికి అనుకూలంగా ఉండడంతో షాపులు ఇబ్బడిముబ్బడిగా ఏర్పడుతున్నాయి. దీంతో భూములకు గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా కొంతమంది వ్యక్తులు ఆక్రమణల పరవం కొనసాగిస్తున్నారు. అటు శ్రీకాకుళం, ఆమదాలవలస, ఇటు బూర్జ వెళ్లేందుకు ప్రధానమైన కూడలి కావడం, ఈ ప్రాంతంలో ఇటికే తయారీ పరిశ్రమ ఉండడంతో ఒడిశా, విశాఖపట్నం ప్రాంతాల నుంచి భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మలుపు వద్ద పెద్ద వాహనాలు తిరగాలంటే వాహన డ్రైవర్లు ప్రాణాలు బిగబెట్టుకోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణల విషయమై రహదారుల శాఖ జెఇ ఎస్. శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

పాత బిల్లుకు కొత్తవి తోడు

కాశీబుగ్గలోని అన్న క్యాంటీన్

- ఏడేళ్లయినా అందని క్యాంటీన్ భవన బిల్లు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ పెట్టి పేదలకు ఆకలి తీర్చుతుంది. అదే అన్న క్యాంటీన్ భవనం నిర్మించిన కాంట్రాక్టరుకు మెండి చేయి చూపించింది. ఏడేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన భవనానికి బిల్లు చెల్లించలేదు. వైసిపి ప్రభుత్వంలో మూసివేసింది. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్ పున:ప్రారంభించింది. అన్న క్యాంటీన్ భవన నిర్మించి పది నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే కోతి నెత్తి మీద తాటిపండు పడినట్లు పాత బిల్లుకు కొత్త బిల్లు తోడై లక్షలాది రూపాయల బిల్లుల కోసం పడిగాపులు కాయల్సి వచ్చింది. నిత్యం బిల్లులు కోసం కాంట్రాక్టరు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

ఏడేళ్ల క్రితం...

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్న క్యాంటీన్ భవన నిర్మాణ బిల్లు నేటికి ఏడేళ్లవుతున్నా కాంట్రాక్టరుకు బిల్లులు అందకపోవడంతో లబోదిబోమంటూ మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయం 2018లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 210 అన్న క్యాంటీన్ల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడా కాంట్రాక్టర్లకు భవన నిర్మాణ పనులను అప్పగించారు. ఇదిలా ఉండగా పలాస, ఇచ్ఛాపురం అన్న క్యాంటీన్లను కెఎంవి కనస్ట్రక్షన్ దక్కించుకుంది. వారు దూర ప్రాంతాల్లో ఉండడంతో పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ నిర్మాణానికి మూల కృష్ణారావు అనే సబ్ కాంట్రాక్టరుకు అప్పగించారు. పలాస రూ.40 లక్షలు, ఇచ్ఛాపురం రూ.40 లక్షలు చొప్పున వెచ్చించి అప్పటిలో అన్న క్యాంటీన్ భావనలను నిర్మించారు. బిల్లులు అందకపోయినా ప్రజాప్రతినిధులు, అధికారుల ఒత్తిడి ప్రజావినియోగ కేంద్రంగా అన్న క్యాంటీన్ ఉండడంతో భవనం నిర్మాణం పనులు పూర్తి చేసి అప్పగించారు. అప్పటి నుంచి టిడిపి ప్రభుత్వం కొనసాగిన వరకు ఈ భవనం ద్వారా ఎంతో మంది ఆకలితీర్చింది. కానీ, కాంట్రాక్టరు మాత్రం బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వం రావడంతో అన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. దీంతో బిల్లులు సైతం విడుదల చేయలేదు.

రూ.12.70 లక్షలతో పున:ప్రారంభం

కూటమి ప్రభుత్వం ఏర్పడి వెంటనే మూతపడిన అన్న క్యాంటీన్లు మరలా తెరిచింది. అయితే మూతపడినా పాత అన్న క్యాంటీన్ వినియోగంలోకి తెచ్చేందుకు రూ.12.70 లక్షలతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు అధికారులు అప్పజెప్పారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో మూల కృష్ణారావుకు ఒప్పించే ప్రయత్నం చేయడంతో ముందుకొచ్చారు. తరువాత రూ.40 లక్షలతో మళ్లీ అన్నా క్యాంటీన్ భవనాన్ని నిర్మించారు. ఏడాది అవుతున్నా ఒక్క రూపాయి రాలేదని, మరలా రూ. 13 లక్షలు వెచ్చించ లేనని తేల్చి చెప్పారు. ఆ సమయంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి త్వరగా అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం చేయాలని ఒత్తిడి రావడంతో అధికారులు ఏమిచేయాలో తోచక చేపట్టిన పనులకు బిల్లులు ఇచ్చేలా చర్యలు చేపడతామని కాంట్రాక్టరు కృష్ణారావుకు ఒప్పించి పనులు చేపించుకున్నారు. అన్న క్యాంటీన్ ప్రారంభమై సుమారు 10 నెలలు కావస్తున్న ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్న క్యాంటీన్లు తెరుచుకొని పేదవాడి ఆకలి తీర్చుతుంది. కానీ, కాంట్రాక్టరుకు బిల్లులు మాత్రం అందకపోవడంతో లబోదిబోమంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో బిల్లులు అందక కొంత మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా జరిగిన సంగతి విధితమే. ఎంతో మంది అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీంతో గతంలో అభివృద్ధి పనుల చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు జరగక నిధులు వెనక్కి మళ్లిన సంఘటనలూ ఉన్నాయి. అలా కాకుండా కాంట్రాక్టర్లు వారు చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కాంట్రాక్టర్లకు తిప్పలు తప్పడం లేదు. సొమ్ము ఒకరిది సోకు ఒకరిది చందంగా ప్రభుత్వం తీరు. అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు ఆకలి తీర్చుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం భవనం నిర్మించిన కాంట్రాక్టర్లు ఎందుకు బిల్లులు చెల్లించడం లేదో అర్థం కావడంలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్న క్యాంటీన్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు వివరణ కోరగా కొత్తగా అన్న క్యాంటీన్ పనులకు సంబంధించి బిల్లులు పెట్టడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే కాంట్రాక్టరుకు డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలి

లావేరు : ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ సాయి ప్రత్యూష పిలుపునిచ్చారు. సోమవారం షలంత్రి గ్రామ పంచాయతీ బురిడివలస సర్వే రెవెన్యూ గ్రామంలో తహశీల్దార్ ఎల్. మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీ సర్వేలో ఆమె పాల్గొన్నారు. ముందుగా రీసర్వే డిటి జగదీష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, రైతులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో ఆర్‌డిఒ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి భూ సమస్యలున్నా రీ సర్వే కార్యక్రమంలో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు సకాలంలో సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఉన్న భూముల వివరాలు, స్వభావం రీ సర్వేతో సమగ్ర నివేదిక రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శివాల సూర్య నారాయణ, సర్పంచ్ ప్రతినిధి అదపాక గౌరీనాయుడు, రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

లావేరు: రీ సర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష అన్నారు. హనుమంతుపురంలో రీసర్వే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల భూ సమస్యలు రేసర్వేతో పరిష్కరించబడతాయని, గ్రామంలో రీసర్వే బృందాలు పర్యటించి సర్వే నిర్వహిస్తారన్నారు. రైతులు, గ్రామస్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్ని జోగారావు, మండల సర్వేయర్ బచ్చు శ్రీధర్ రెడ్డి, రీసర్వే డిటి ఎం.తిరుపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పల రాజు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

వజ్రపుకొత్తూరు: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు రీ సర్వే ద్వారా చక్కని పరిష్కారం లభిస్తుందని పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. మండలంలోని బెండి పంచాయతీ మహాదేవిపురంలో తహశీల్దార్ సీతారామయ్య అధ్యక్షతన రీ సర్వే ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా రెవెన్యూ అధికారులకు అర్జీలు పెట్టుకుంటే పరిష్కారం లభిస్తుందన్నారు. అన్ని రకాల భూములకు హద్దులు నిర్ణయించడం, భూమి స్వభావం నిర్ధారిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి కంచరాన శ్రావణ్‌కుమార్, సర్వేయర్ తిరుపతిరావు, డిఐఒఎస్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

కుమారుని మృతిపై న్యాయం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

పంచాయతీ పరిధిలోని ఎరుకుల కాలనీకి చెందిన తన కుమారుడు గొర్లె కన్నారావు అనుమానాస్పద మృతిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు న్యాయం చేయాలంటూ తండ్రి గొర్లె శ్రీరాములు సోమవారం ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు గత నెల 10న పాతపట్నం సమీపంలోని ధనుపురం వద్ద కన్నారావు చనిపోయినట్లుగా తమకు సమాచారం రావడంతో హుటాహుటిన వెళ్లామని పేర్కొన్నారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారని, అయితే అది ఆత్మహత్య కాదని, హత్యని అనుమానాన్ని వ్యక్తం చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు, గాడిదపాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న తమ కుమారుడిని భార్య నాగలక్ష్మి, ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులే హత్య చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేసి తమకు న్యాయం చేయాలని ఆయన ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

అధునాతన ఫీచర్లతో

అర్బన్ క్రూయిజర్ హైరైడర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) సోమవారం పెద్దపాడు టోయోటా షోరూంలో అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో భద్రత, సౌకర్యం సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్‌గ్రేడ్‌లను ప్రవేశపెట్టినట్లు సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువిగా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటిందని, ఇది దాని వినూత్న సాంకేతికత, అసాధారణమైన ఇంధన సామర్థ్యం, శక్తివంతమైన పనితీరు, ప్రీమియం డ్రైవింగ్ అనుభవంతో అందరి మన్ననలు పొందుతుందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయన్నారు. ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తూ ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు ఇప్పుడు అన్ని వేరియంట్లలో ప్రామాణికంగా ఉన్నాయన్నారు. అలాగే ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్‌కు ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ జోడించబడిందని, సౌకర్యం కోసం 8-వే అడ్జస్టబుల్ పవర్ డ్రైవర్ సీట్, యాంబియంట్ లైటింగ్, క్యాబిన్ లోపల మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణను నిర్ధారిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ డిస్‌ప్లే జోడించబడిందన్నారు. తాజా అర్బన్ క్రూయిజర్ హైరైడర్ అనేది అత్యుత్తమ సాంకేతికత, అధునాతన భద్రత, ఉన్నతమైన సౌకర్యం అందించాలనే నిబద్ధతకు నిదర్శనమన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి

టోపీ, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రానున్న వేసవికాలం దృష్ట్యా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వేసవి వేడి తాపాన్ని తట్టుకునేందుకు పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి టోపీలు, చలువ కళ్లద్దాలు అందజేశారు. వరం చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు వీటిని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్ పట్టణంలో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేయాలని సూచించారు, రానున్న వేసవి కాలం దృష్ట్యా సిబ్బంది జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని, పట్టణంలో ముఖ్య కూడళ్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సిబ్బంది, ప్రజల కొరకు ప్రత్యేకంగా తాగడానికి మంచినీరు, మజ్జిగను నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వేసవి కాలంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడే సామగ్రిని వరం చారిటబుల్ ట్రస్ట్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టౌన్ డిఎస్‌పి సిహెచ్ వివేకానంద, ట్రాఫిక్ సిఐ నాగరాజు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఎర్ర గోవిందపుట్టుగ, పెద్ద ఎర్ర గోవిందుపుట్టుగ, బల్ల ఎర్రగోవిందుపుట్టుగ, కరాపాడు పంచాయతీలోని బింగిపుట్టుగ, లండారిపుట్టుగ పంచాయతీలోని బల్లపుట్టుగ తదితర గ్రామాల్లో రెండు నెలలుగా ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నట్టు బల్ల జానికిరావు, బింగి కోదండరావు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో తహశీల్దార్ మురళీమోహన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఉద్దానం పథకం ద్వారా తాగుచినీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే ఉద్దానం పథకం ప్రధాన బోర్ వెల్ ఉన్న జగతి బీలలో నీటి ఎద్దడి కారణంగా ఆయా గ్రామాలకు నీరు సరఫరా చేయలేకపోతున్నట్టు సంబంధిత సిబ్బంది తెలిపినట్టు చెప్పారు. గతంలో వేసిన బోర్లు కూడా మరమ్మతులకు గురవడంతో తాగునీటి నీటి సమస్య తీవ్రమైనట్టు అధికారులకు తెలిపారు. దీంతో సుమారు 2000 జనాభా పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఎం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న జానకిరావు



మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన రాము

మంత్రిని కలిసిన రాము

రణస్థలం: కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము సోమవారం శ్రీకాకుళం మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 27న విశాఖపట్నంలో జరగనున్న ఉత్తరాంధ్ర రజకులు అభినందన సభకు ముఖ్యఅతిథిగా రావాలని కేంద్రమంత్రికి ఆహ్వానం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక మాజీచైర్మన్ నారాయణరావు, రజక సంఘ నాయకులు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

'ఐస్'గా ముంచేస్తున్నారు

ప్రజాశక్తి- గుజరాతీపేట

వేసవికాలం మొదలవడంతో భానుడి ప్రతాపానికి ఎండల వేడికి తట్టుకోలేక జనం అల్లాడిపోతున్నారు. ఉపశమనం కోసం అనేక మార్గాలు అనుసరిస్తూ రకరకాల శీతల పానీయాలను సేవిస్తున్నారు. అయితే జ్యూస్ సెంటర్ల వద్ద పలుచోట్ల అపరిశుభ్రంగా ఉన్న ఐస్‌ను ఉపయోగిస్తున్నారు. ఐస్ తయారీ కేంద్రాల్లో కనీస శుభ్రతను పాటించడం లేదు. సంచుల్లో వేయటం, తుప్పు పట్టిన బాక్స్‌లు, ఐస్ తయారీ పరికరాలకు వినియోగిస్తున్నారు. ఐస్ తయారీకి ఉపయోగించే నీరు కూడా మంచి నీటిని ఉపయోగించటం లేదు. ఐస్ పంపిణీ చేసేటప్పుడు, దానిని కటింగ్ చేసేటప్పుడు నేలపై శుభ్రంగా లేని ప్రదేశాల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. అలాగే పళ్ల రసాల దుకాణాలు కూడా ఈ ఐస్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. అంతేకాకుండా పళ్లరసాల దుకాణాల వద్ద శుభ్రంగా లేకపోవడం, వినియోగించిన తరువాత వాటిని శుభ్రపర్చకపోయినా వీటిని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. జ్యూస్ సెంటర్ల వద్ద వ్యర్థాలు తియ్యగా ఉండటం, చెత్త అక్కడే వేయడం వలన చెత్తపై, పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉన్న వాటిపై వాలిన ఈగలు జ్యూస్ షాపుల వద్ద ఎక్కువగా వాలడంతో అనేక అనారోగ్యాలకు కారణం అవుతున్నాయి. ఆరోగ్యం, వేసవి తాపానికి సేవించే పళ్ల రసాలు వారికి తెలియకుండానే అనారోగ్యం పాలవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజలు కోరుతున్నారు. మరి అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



అపరిశుభ్రంగా ఉన్న ఐస్

తుప్పు పట్టిన పరికరాలు

చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఆటో బోల్తా : ఏడుగురికి గాయాలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తం పురం, అమీన్సాహెబ్‌పేట గ్రామాలకు చెందిన 12 మంది విద్యార్థులతో హెబ్రాన్ స్కూల్‌కి తీసుకొస్తున్న ఆటో సోమవారం బోల్తా పడడంతో ఏడుగురు గాయ పడ్డారు. డ్రైవర్ నిర్లక్షంగా నడపడంతో ముత్యాలమ్మ పేటరెడ్డి గ్యారేజీ వద్ద లారీని తప్పించ`బోయి ఆటో అదుపు బోల్తా పడింది. వెంటనే స్థానికులు ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ ముకుందరావు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆటోడ్రైవరు నిర్లక్ష్యం, వేగంగా నడపడంతో బోల్తా పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తే చర్యలు

స్కూల్ పిల్లలను తీసుకునే వెళ్లే ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్‌ఐ ముకుందరావు హెచ్చరించారు. స్థానిక ఆటో స్టాండ్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అన్ని స్కూళ్ల ఆటో డ్రైవర్లు, బస్ డ్రైవర్లను పిలిపించి పరిమిట్లు, ఇన్స్యూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

రైలు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు - జి.సిగడాం రైల్వేస్టేషన్ల మధ్యలో గల వాండ్రంగి రైల్వేగేటు సమీపంలో ఆదివారం రాత్రి రైలు ఢీకొనడంతో రెడ్డి వెంకటరమణ (20) అనే యువకుడు మృతి చెందినట్లు జిఆర్‌పి ఇన్‌ఛార్జి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. మృతుడిది విజయనగరం జిల్లా రాజాం మండలం సిఎస్‌ఆర్‌పురం వాసిగా గుర్తించామని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తూ మృతి చెందాడా, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడనేది విచారస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

శార్వాణి (ఫైల్)

హరిశ్చంద్రపురం మాజీ ఎమ్మెల్యే కింజరాపు కృష్ణమూర్తి నాయుడు సతీమణి శార్వాణి (85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. అమె కుమారుడు రిజనల్ సీఫ్ విజిలెన్స్ అధికారి (ఉత్తరాంధ్ర విద్యుత్ ప్రాంతీయ నిఘా విభాగం అధికారి) కింజరాపు రామకృష్ణ ప్రసాద్ ఇంటి వద్ద విశాఖపట్నంలో ఉండేవారు. అమె అంత్యక్రియలు స్వగ్రామం నిమ్మాడలో నిర్వహించారు. 1967లో స్వతంత్ర పార్టీ తరపున హరిశ్చంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఈమె భర్త కృష్ణమూర్తి నాయుడు పనిచేశారు. కష్ణమూర్తి నాయుడు, వెంకట్రాములు, దాలినాయుడు, విశ్వనాథం నలుగురు అన్నదమ్ములు. వీరిలో దాలినాయుడు మంత్రి అచ్చెన్నాయుడుకు తండ్రి. అంత్యక్రియల్లో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తన కుటుంబ సభ్యులతో నిమ్మాడకు చేరుకుని పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

పలాస: మండలంలోని మొగిలిపాడు సమీపంలో నాటుసారా అమకోవడానికి తరలిస్తుండడంతో సోమవారం పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు తెలిపారు. దూగాన అప్పలస్వామి గిరిజన ప్రాంతంలో సాటుసారా కొనుగోలు చేసుకొని పట్టుకొని వస్తుండగా తనిఖీల్లో భాగంగా ఆయన పటబడ్డారని అన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ షేక్షైదా, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని హడ్డివాడలో ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా ఊటలపై సోమవారం విస్తృతంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 450 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ శాఖ సిఐ మీరా సాహెబ్ తెలిపారు. గ్రామానికి చెందిన కోసింటి నరసింహ వద్ద నుంచి 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసి అరెస్టు చేసి టెక్కలి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో టెక్కలి ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి గోపినాథపురం ఊర చెరువుకు వెళ్లే వంశధార 49 ఆర్-1 ఆర్ కాలవను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని, వాటిని తొలగించాలని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, హెచ్.ఈశ్వరరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆక్రమణకు గురైన కాలువను సోమవారం పరిశీలించారు. లోతు చేసి ఊర చెరువుకు నీరు వెళ్లేవిధంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే బన్నువాడ వైపుకు పోతున్న 49-అర్ నుంచి జయ కృష్ణాపురం ఊర చెరువుకు పోయే కాలవను మరమ్మతులు చేపట్టాలన్నారు. తక్షణం రెవెన్యూ, వంశధార అధికారులు స్పందించి కాలవను పునరు ద్ధరించి మరమ్మతులు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బగాది వాసుదేవరావు, బమ్మిడి సోమేసులు పాల్గొన్నారు.

ఆక్రమణలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వజ్రపుకొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అప్పలరాజు

మాజీ మంత్రి పరామర్శ

వజ్రపుకొత్తూరు : మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన మత్స్యకారులు వంక కృష్ణ, దేవరాజ్‌లు సముద్రంలో పడవ బోల్తాపడి ఇద్దరు మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం వెంటనే అందజేయాలని కోరారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వంక రాజు, మండల వైసిపి అధ్యక్షులు తిర్రి రాజారావు, మత్స్యకార నాయకులు అంబటి ఆనంద్, పలాస పట్టణ అధ్యక్షులు శిష్టి గోపి, సెంబూరావు, వీరాస్వామి, తులసీరావు, మోహనరావు పాల్గొన్నారు.

పలాస : వైద్యుడు బాలకృష్ణ తండ్రి మల్లేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు సోమవారం బాలకృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు దుర్గాశంకర్ పండా, శిష్టి గోపి, బోర బుజ్జి, మందస ఎంపిపి డొక్కరి దానయ్య ఉన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని దుప్పలవలస డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈనెల 5న విజయవాడలో అటవీశాఖ ఆధ్వర్యంలో 12వ జాతీయ చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 101 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 11 మంది సిల్వర్ పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ బుచ్చిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి విద్యార్థి ప్రసన్న ఆల్ ఇండియా చిత్రలేఖనం అవార్డు పొందినట్లు స్పష్టం చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మగౌరవ పోరాట దినాలు పాటిద్దాం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈ నెల 11 నుంచి 14 వరకు ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దామని కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలామర ప్రభాకర్, కార్యదర్శి రాకోటి రాంబాబు అన్నారు. సోమవారం గొడుగులు వీధిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 11న పూలే, 14 అంబేద్కర్ జయంత్యుత్సవాలు వాడవాడలా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో పాలిస్తున్న పాలకులు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నరని, అందులో భాగంగానే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మడానికి సిద్ధం చేస్తున్నారరని పేర్కొన్నారు. బస్టర్‌లో భూమి కింద ఉండే గనులను, అడవులను కట్టబెట్టడానికి అడ్డు వచ్చే ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో ఎన్‌కౌంటర్ చేయిస్తున్నారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ సొమ్మును వారికి ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు మళ్లించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, గొడగల సంఘం నాయకులు అశోక్, సురేష్, రామారావు, భాస్కర్, సావిత్రి, సులోచన, రమణమ్మ, సుజాత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

జాతీయ సమైక్యతే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జాతీయ సమైక్యతే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అదే స్ఫూర్తితో ఇంద్రజాల ప్రదర్శనలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అపర ఆంధ్ర సర్కార్ మాంత్రిక రాజా బేతా ఖనివాసరాజు అన్నారు. మండలంలోని కొర్లకోటలో జాతీయ సమైక్యత కోసం ఆదివారం రాత్రి ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమ సమన్వయకర్త, జర్నలిస్టు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలో ఎన్నో భాషలు, మతాలు, కులాలు ఉన్నప్పటికీ దేశం కోసం ఒక్కటి కావడమే లక్ష్యంగా మేజికల్ ఒడిసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సువ్వారి నేతాజీ, సీనియర్ రంగ స్థల కళాకారులు ధనుంజయ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శ్రీనివాస్ రాజు, వేణుగోపాల్‌ను సత్కరించారు. సుమారు మూడుగంటల పాటు నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శనలో జాతీయ సమైక్యతకు దోహదం చేసే అంశాలపై చర్చించారు. ఇంద్రజాల ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను అలరించింది.

బోధనేతర పనులు అప్పగించొద్దు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక్క ఎన్నికల విధులు మినహాయించి ఏ ఒక్క బోధనేతర కార్యక్రమాలూ అప్పగించరాదని సుప్రీంకోర్టు నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఈ అంశంలో పలుమార్లు సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చినా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను సమ్మేటివ్ పరీక్ష పత్రాలను మండల విద్యా కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోమనడం సమంజసం కాదని అపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.చిన్నికృష్ణం నాయుడు, ఎస్.రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించకూడదని విద్యాహక్కు చట్టం కూడా చెబుతుందని, సమయానికి పాఠశాలలో ఉండాల్సిన ఉపాధ్యాయులు ఎంఆర్‌సిల చుట్టూ తిరుగుతూ పేపర్లు కలెక్ట్ చేసుకోవాల్సిన అగత్యం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలలకు సమయానికి పరీక్ష పత్రాలు అందించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. దానికోసం వారికి ఉన్నటువంటి సిఆర్‌ఎంటి సిబ్బందిని ఉపయోగించి పాఠశాలలకు సమయానికి పరీక్ష పత్రాలను అందించాలని డిమాండ్ చేశారు.

సహజ ప్రసవాలపై అవగాహన

ఇచ్ఛాపురం : మండలంలోని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి సహజ ప్రసవాలపై గర్భిణులకు సోమవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారంపై గైనకాలజిస్టు డాక్టర్ సనపల అనూష వివరించారు. సహజ ప్రసవంపై వచ్చే ఫలితాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ నర్సు భవాని, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనూష

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

శ్రీకాకుళం అర్బన్ : వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలోని బ్లడ్ బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి జగన్ మోహన్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ చూపాలన్నారు. డాక్టర్ జి.ఆర్.శ్రీకాంత్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. మధుమేహ, రక్తపోటు, బ్లడ్‌గ్రూప్, రక్త శాతం, సాధారణ రోగాలకు పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ఎంసి మెంబర్స్ బి. చిన్మయిరావు, ఎం.కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని సీనియర్ వైద్యాధికారి డా. వెంకట లక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం మనిషికి గొప్ప వరమని అనారోగ్యంతో బాధపడుతున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో వివాహం సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఆస్పత్రి ప్రసవాలు తల్లి బిడ్డలకు ఆనందమన్నారు. ఆడబిడ్డకు 21, మగ బిడ్డకు 25 ఏళ్లు దాటిన తర్వాత వివాహం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య సంరక్షణలో కీలకమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పువ్వల సుజాత, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కెజిబివి ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివిలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం యోగేశ్వరి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సునీత ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి కింతలి కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఎస్.వి.రమణ, అధ్యాపకులు,పాల్గొన్నారు.

పొందూరు : కింతలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోటబొమ్మాళి: ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక జూనియర్ సవిల్ కోర్టు న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. ప్రపంచ అరోగ్య దినోత్సవం సందర్భంగా కోర్టులో ప్రత్యేక న్యాయ ఎవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పుట్టిన బిడ్డలకు వెంటనే అందించాల్సిన ఆరోగ్య సహాయ సహకారాలు ఆహార పోషక అవసరాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్.శ్రీనివాస్, పి.అర్జునరావు, పి.వాసుదేవరావు, వెంకటరావు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

ఎచ్చెర్ల: మండలంలోని కింతలి మిల్లు వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో హరిప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, వేణుకు తీవ్రంగా గాయాలయ్యాయి. హుటాహుటిన విశాఖ కెజిహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందడంతో ఎచ్చెర్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వేణు కుటుంబ సభ్యులు నిర్ణయం మేరకు వేణు నేత్రాలను దానం చేశారు.

మాట్లాడుతున్న విజయకుమార్

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్థానిక ఆర్‌టిసి డిపోలో నిర్వహిస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణలో భాగంగా 20వ బ్యాచ్ తరగతులను జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ సోమవారం ప్రారంభించారు. 40 రోజుల పాటు నిర్వహించే ఈశిక్షణలో ఎక్కడా లేనన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆర్‌టిసిలో శిక్షణ పొందిన డ్రైవర్లు ఎక్కడైనా ఉపాధి పొందడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో 1, 2, డిపోల మేనేజర్లు అమరసింహుడు, శర్మ, పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, శిక్షకుడు జి.ఎస్.రావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్

స్టాల్స్ ఏర్పాటు

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశామని కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలన్నారు. అందరకీ ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఉద్యమంగా మారి ముందుకెళ్లే ప్రక్రియలో తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఇఒ సంతోష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రూప, కుమారి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున శేఖర్

బాల్య వివాహాలు అనర్థం

ఇచ్ఛాపురం : బాల్య వివాహాలతో అనేక అనార్థలు ఉన్నాయని టిడిపి వార్డు ఇన్‌ఛార్జి ఎస్.శేఖర్ అన్నారు. మండలంలోని బెల్లుపడా కాలనీలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన కిషోర వికాసపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, లైంగిక వేధింపుల నుంచి రక్షణపై వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నాగరాణి, వార్డు కౌన్సిలర్లు గువ్వడా ప్రదీప్, గేదల శేఖర్, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పాతపట్నం మండలంలోని కొరసవాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబరు 196-3 శ్మశానం ఆక్రమణలకు గురైంది. సమాచారం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి బి.తిరుపతిరావు, కార్యదర్శి ఎ.కృష్ణంరాజులు సోమవారం ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాదకద్రవ్యాలపై విస్తృత తనిఖీ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని సుభద్రాపురం, లావేరు, వెంకటాపురం గ్రామాల్లో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు లావేరు పోలీసులు సోమవారం నార్కోటిక్ డాగ్ బృందాలతో షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాలు, సరఫరా చేసినటువంటి వారిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో ఎఎస్‌ఐ భుజంగరావు, డాగ్ తనిఖీ బృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్‌వలసలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన జాతీయ సేవాపథకం నిర్వహణలో భాగంగా సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యాన గ్రామంలో ఉన్న పాడి, ఇతర పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగహన కల్పించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నైరా కళాశాల కీటక శాస్త్ర అధ్యాపకులు డా.శ్రీసంధ్య హాజరై రైతులకు రబీ పంటల సాగులో పురుగు మందులు, కీటకాల యాజమాన్యంపై పలు సూచనలు అందించారు. రబీసాగులో వాడే పురుగుల మందుల అవశేషాలు వలన నేలకు, మానవాళికి నష్టం చేకూరుతుందన్నారు. మొక్కజొన్న, నువ్వులు, వేరుశెనగ పంటల్లో విత్తనశుద్ధి, పురుగు మందుల వాడకం, కీటకాల యాజమాన్యంపై రైతులు అవగహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు గోవిందరావు, స్పందన, పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు

విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణంలో జాతీయ సేవా పథకం యూనిట్-4 ప్రోగ్రాం ఆఫీసర్ డా.జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో వాలంటీర్లకు సర్వీస్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా ఉన్నతమైందని, సామాజిక విషయాలపై అవగాహన చేసుకుంటూనే వాలంటీర్లు నాయకత్వపు లక్షణాలు నేర్చుకొని ప్రజల్లో చైతన్యం కలిగించవచ్చున్నారు. ఉద్యోగ ప్రయత్నాలు చేసినప్పుడు కూడా ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్ ఆయా రంగాల్లో ఉపయోగ పడుందన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.పి.ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.జి. ఈశ్వరరావు, డా.వి.సింహాచలం, ఆర్.పద్మవతి డా.మళ్ల సూరిగణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్న వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందించారు.

అవకాశాలు కోల్పోతున్నాం

ప్రజాశక్తి- కవిటి

తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యావ్యవస్థలో, పోటీ ప్రపంచంలో తాము విలువైన అవకాశాలు కోల్పోతున్నామని పలువురు బెంతు ఒరియా విద్యార్థులు వాపోయారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న నిరాహార దీక్షలు 467వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా సోమవారం దీక్షలో లొండపుట్టుగకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులకు సంబంధించి అన్ని నోటిఫికేషన్లు జారీ చేశారని, కానీ, తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తాము ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కోల్పోతున్నట్లు తెలిపారు. చాలామంది యువకులు ఉపాధి కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని వారు కోరారు. దీక్షలో పవన్ మజ్జి, కోదండ బిసాయి, అనిల్ బిసాయి, అనిల్ దళాయి, ప్రవీణ్ దళాయి సుశాంత్ బిసాయి పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న విద్యార్థులు

సింగుపురంలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు నేరుగా అందించడానికి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతోందని, వాటిని సద్వినియోగ పరచుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. సోమవారం మండలం సింగుపురం హటకేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరాన్ని గ్రామ సర్పంచ్ గుండ అదిత్యనాయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎబి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జనరల్ చెకప్, బిపి, షుగర్, కళ్లు, దంతాలు , గర్భిణీ స్త్రీలకు తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ, మాజీ సర్పంచ్ గుండ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు ప్రహరీ కోసం వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా పూజారిపేట వద్ద నున్న క్రిస్టియన్ మైనారిటీ బరియల్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ లేక సరైన సంరక్షణ లేక భయానకమైన పరిస్థితుల్లో ఉందని దానిని పరిశుభ్రం చేయించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా అదనపు జనరల్ సెక్రెటరీ శామ్యూల్ అరుణ్ కుమార్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ బి.లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. క్రైస్తవులు జరుపుకునే సమాధుల పండుగ (ఈస్టర్)కు క్రైస్తవులు వెళ్లే మార్గంగానీ, ఆ ప్రాంతం మలవిసర్జనలతో దుర్వాసనతో అపరిశుభ్రంగా ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ,క్రైస్తవ నాయకులు బ్రదర్ సవలాపురపు అసిర్ కుమార్, బ్రదర్ అహరోన్ రాజ్ బోర్ను తదితరులున్నారు.

మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరుణ్ కుమార్

బోధనా సామగ్రి పంపిణీ

ఇచ్ఛాపురం : మండలంలోని కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని క్లస్టర్ పాఠశాలలకు స్కూల్ కాంప్లెక్స్ నిధుల నుంచి బోధనా సామగ్రిని ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ సోమవారం అందించారు. క్లస్టర్ పరిధిలోని ప్రైమరీ పాఠశాలలు కొలిగాం, కీర్తిపురం, పాయితారి, సైదాలపుట్టుగా, మశాఖపురం, బిర్లంగి, బిర్లంగితొటూరు, బోడోబాడో పాఠశాలలకు తెలుగు, ఒడియా బోధనా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి శ్రీ కోదండరామ ఆలయంలో సోమవారం సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ రజని దంపతులు నిర్వహించారు. అనంతరం చిలుకూరి సత్యనారాయణ, పద్మ దంపతులు స్వామి వారికి పట్టాభిషేకం కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మూడు వేల మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎన్.మహాలక్ష్మి, ఎన్ఇఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజబాబు, సాయి చంద్, గురాల జగన్నాథరావు, చంటిబాబు, మన్నె నారాయణరావు, కృష్ణానందం, వెలిచేటి సురేష్ కుమార్, రాయుడు, మన్నె వరాహమూర్తి, లక్ష్మి ప్రసాద్, జి.త్రినాధరావు, వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు చెందిన నాలుగో సెమిస్టర్ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. జిల్లాలోని 53 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతున్నాయి. మొదటిరోజు పలు పరీక్షా కేంద్రాలను వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, స్పెషల్ ఆఫీసర్ డా. కె. సామ్రాజ్య లక్ష్మిలు సందర్శించారు. ఆమదాలవలసలోని ప్రభుత్వ, టిఎస్ఆర్, సాగర్ డిగ్రీ కళాశాలలతో పాటు శ్రీకాకుళం పట్టణంలోని సన్, హెచ్‌పిఎన్, కాకినాడ ఆదిత్య, విద్యాధరి కళాశాలల్లో జరుగుతున్న డిగ్రీ పరీక్షలను పరిశీలించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు, విమర్శలకు అస్కారం లేకుండా పరీక్షలను సాఫీగా నిర్వహించాలని ఆయా కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. అదేవిధంగా నీటివసతి, మరుగు దొడ్లు అందుబాటులో ఉంచుతూ మంచి వెలుతురు, గాలి వచ్చే తరగతి గదుల్లో పరీక్షలను నిర్వహించాలని సూచించారు.

జెండాను ఆవిష్కరిస్తున్న దుర్గారావు

జనసేన అభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జనసేన పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేయాలని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు కోరారు. మండలంలోని కొమరల్లాడలో జనసేన నాయకులు చింత దానేష్, చింత మోహనరావు, తామాడ లక్ష్మణరావు ఆధ్వర్యాన జనసేన జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన బలోపేతం దిశగా గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ పండా, వంశీకృష్ణచౌదరి, ఆర్జి తులసీరావు, గణపతిరావు, తేజేశ్వరరావు, సురేష్, కృష్ణారావు, పద్మనాభం, బాబూరావు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు

30 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025లో ఇఇఇ బిటెక్, డిప్లొమో కోర్సులను పూర్తి చేసిన 30 మంది విద్యార్థులు చెన్నై కేంద్రంగా ఉన్న వోల్టెక్ ఇంజినీర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం అభ్యర్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షిక వేతనంగా ఒక్కొక్కరికి రూ.2.5 లక్షలు చెల్లించడం, రవాణా, భోజన వసతి సౌకర్యాన్ని ఆ కంపెనీ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇఇఇ బిటెక్ విద్యార్థులు 23 మంది, డిప్లొమో ఇఇఇ విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని వివరించారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌డిలు డాక్టర్ డి. విజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, టిపిఒ డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్ అభినందించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'స్పందన' ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం బడేకుప్పన్నపేట కార్యస్థానంగా పనిచేస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ కాపుగోదవలసకు చెల్లూరి లక్ష్మికి సోమవారం ఆర్థికసాయం అందించింది. లక్ష్మి భర్త మృతి చెందిన నాటిని హోటల్‌లో కూలీగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ వస్తుంది. ఇటీవల సంభవించి రోడ్డు ప్రమాదంలో ఆమె కుమారు రవి గాయపడి కోమాలో ఉన్నాడు. ప్రస్తుతం శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ అధ్యక్షులు షణ్ముఖరావు, నరసాపురం సర్పంచ్ దుక్కభూషణరెడ్డి, కొర్రాయి అప్పన్న పాల్గొన్నారు.

బెల్లం వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బెల్ల నిల్వలు అధిక మొత్తంలో నిల్వ ఉంచకూడదని, నిబంధనల ప్రకారం అమ్మకాలు చేపట్టాలని తహశీల్దార్ బడే పాపారావు, టెక్కలి ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన నమోదయ 2.5 కార్యక్రమంలో భాగంగా బెల్లం వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా నిషేధం కార్యక్రమంలో భాగంగా వ్యాపారస్తుల వద్ద అధిక మొత్తంలో బెల్లం నిల్వలు ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు పాల్గొన్నారు

పనులను ప్రారంభిస్తున్న శాంతిస్వరూప్‌రెడ్డి

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో టిడిపి యువ నాయకులు సుగ్గు శాంతిస్వరూప్‌రెడ్డి సోమవారం ఉపాధి హామీ పనులను సోమవారం ప్రారంభించారు. నౌపడ ఒరెమ్మడిలో అధికారులతో ప్రారంభించారు. జాబ్‌కార్డుదారులకు వంద రోజులు పని కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహంతి రాజు, కర్రి శంకర్ పాల్గొన్నారు.